# దేవుని విరాడ్రూప వర్ణనము (దైవకుమార వర్ణనము - 1884)

## సీసమాలిక

శ్రీ నిత్యమంగళాశ్రితపాల సుగుణాల
వాల కీర్తివిశాల వరసుశీల।
అకిలదుష్కృత్యవంశాటవిదావాగ్ని
బుధజనానందాబ్ధి పూర్ణచంద్ర।
దేవాదిదేవ నీ దివ్యాత్మనాయాత్మ
కందిచ్చికృపనేలు మనుదినంబు।
నీవు నేరిపినట్లు నీదాసుడను రచిం
చిన సీసమాలిక చెలువమలర।
బంగారుపూదండ భంగిని నీసేవ
కర్పించెదను దీని నవధరింపు।
మిలలోన నిజదేవు డెవ్వడో యనువారి
కీపద్య మొకకొంత యెఱుక చేయు।
ఆకాశమవ్వలి యాకాశమటమీది
యాకాశమామీద నతనిశిరము।
క్రిందిలోకము నేలక్రిందిలోకంబులం
తటి క్రిందనుండు నాతనిపదములు ।
దిక్కులన్నియు సర్వదిక్కులన్నియు బాహు
వులుచాచి కౌగిట నునుచునతడు।
ఒక్కొక్క బ్రహ్మాండ మొక్కొక్కరోమ రం
ధ్రమునందువర్తించు తనువతనిది ।
మించుతీగెలదాచి యుంచురీతినికప్పు
విప్పునాతనికన్ను రెప్పదోయి ।

భూనభోంతరముల బుట్టు శబ్ధార్థోక్తు
లాలించు నెల్లప్పు డతని చెవులు।
ఫలమూలపత్రపుష్పరస ప్రవాహంబు
లనిశంబువర్షించు నతనిజిహ్వ।
భూరిఝంఝూవాత పోతంబులాతని
నాసికారంధ్ర నిశ్వాసగతులు।
ప్రబలకాదంబినీ పటలమాతనిపదా
బ్జములు ప్రక్షాళించు పాత్రలగును।
క్షితిసతీమణికలం కృతులంపినట్లు వ
ర్షోపలంబులురాల్పు నొడయుడతడు।
అంగవస్త్రముభంగి నాకాశమంతయు
మడతలుజేయు సామర్థ్యుడతడు।
జగముకన్న యిన భాస్కరుని తేజోరాశి
యతని వాకిలిదీప మనగబడును।
మహిజాలాకాశసంభవ ప్రాణికోట్లకె
వ్వనిహస్తతలము భోజనపుపాత్ర।
సర్వసాగరనదీసలిలముల్ చిన్న బిం
దువులుగా భాగించు నెవని చెయ్యి।
గట్లనన్నిటిమూట గట్టిముష్టినిపిండి
గొట్టజాలిన జగద్జుట్టియతడు।
ఎననినిట్టూర్పుచే రవిచంద్రతారల
దీప్తులుచల్లారి తిమిరమగును।
కొనగోరుపైభూమి గోళంబునిలిపి బొం
గరముభంగిని ద్రిప్ప గలడతండు।
మొదలును తుదలేక తుదమొదల్ దానయై
యొక్కడై చక్కగా నుండు నతడు।

వెనుకముందును లేక మునువెన్కదానయై
మనసుకందగరాని ఘనుడతండు।
అంతవాడింతవా దనరాదు యనలేదు
తనకుదానెయెరుంగు దైవమతడు॥

భూతపంచకమతనికి బొమ్మరిల్లు
ఖచరభూచర జలచరా ఖర్వసర్వ
జంతుజాలంబులును నర సముదయములు
స్థావరములెల్ల నాతనని జఠరపిఠర
ముందుబుట్టుచు పెరుగుచు నణగిపోవు
నిట్టివానిని వర్ణింపనెరుకసేయ
మానవుడనేడు జేనల మంటిపురుగు
వంటి నేనెంత యతడెంత వర్ణనెంత
పరమపురుషుడు సర్వాధిపతివిశుద్ధ
సుస్వభావుడుఘనవిరాట స్వరూపు
డీతడొకమారుతననామ మెరుకజేసె
మోసెయను దీర్ఘదర్శితో భాసురముగ
మరియు నొకసారె మరియతో నెరుగదెలిపె
నహహ యీపేరు యేసుక్రీస్తునగబరగె
పృథ్వినవతారమెత్తిన విశ్వరూపి
యన విరాడ్రూపియననొక్కడతడెగాక
యితరవేల్పులకీ పేరు లివ్వదగదు
నిగమములకందరాని యీ సగుణమునకు
తగనిగుణదోషరూపాదు లగణితముగ
జేర్పగూడదు సత్యంబు మార్చదగదు
సగుణనిర్గుణములయందు దగిలిదగల
కున్నవాదును ఉన్నాడ నన్నవాడు

యేసుడనువాడె యతడితం డితడెయతడు
దీనుడనన్ను రక్షించు దేవ దేవ
నిన్ను సేవించెదను నన్ను గన్న తండ్రి
సజ్జనస్తోమశుభదామ సార్వభౌమా॥

క॥ ఓ పరమపురుష నీకరు
ణాపాంగవిలోకనమున నస్మత్కృతమై
దీపించు సీసమాలను
స్థాపింపను పతకమొకటి దయసేయగదే.

గీ॥ మహిమమీరిన యా సీసమాలయందు
పతకమొక్కటి సమకూర్చ వెతుకుచుండ
వజ్రవైదూర్య ముక్తాప్రవాళ పద్మ
రాగములనింపు పతకంబు ప్రాప్తమయ్యె.

అది యెట్లంటేనీ

గీ॥ మనువిగ్రహా నిర్మాణమనెడిచిన్న
పత్రికరచించి దానిలో పంచరత్న
ములనుగూర్చితినవియిప్పుడెలమితోడ
పతకమొనరించబడె సీసమాలయందు.

## పంచరత్నములు

1. ఎవ్వడు తనజేన నిమిడించి కొలుచు నీ
యాకాశ మండలం బద్భుతముగ,
నెవ్వడీ పుడమి మన్నెల్లను తన కుంచ
మునకు లోబడజేయు ఘనబలమున,

యెవ్వడీ మహిత మహీధరంబుల బట్టి
తన తరాజున నుంచి యొనర దూఁచు,
నెవ్వడీ జలధులం దిముడు నీరములన్ని
తన చేతి పుడిసెలో నునిచి కొలుచు,

తే॥గీ॥ వసుధగల సర్వజీవాళి నిసుక కన్న
సన్నముగ జూచి త్రాసులో నరగ నునుచు,
నెవడో యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు.

2. ఎవ్వని చేతిలో నీ విశ్వమంతయు
నాటల పూబంతి యట్టులుండు,
నెవ్వని కాంతియం దీసూర్యచంద్రులు
మెరుగుడు పురుగుల ట్లెరుగబడుదు,
రెవ్వని యొడిగట్ట నీ తారలన్నియు
మల్లెమొగ్గలరీతి గిల్లబడును,
యెవ్వని కనుదృష్టి కీ భూమి గోళంబు
నరసావగింజతో సాటిపడును

తే॥గీ॥ యెవని మీగాళ్ళ బంటి రావీయగాధ,
వార్ధి నీరములటువంటి వర బలాఢ్యు,
డెవడో యాతడెనా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు

3. పరమండలము వసుంధర మండలము బట్టి
బంతులట్లాడించు ప్రబలుదెవడు,
పగటెండ రేయెండ పాన్పులట్లుగ చుట్ట
బెట్టి వేరొకచోట బెట్టునెవడు,

సర్వ జీవాధార సంచార పవనంబు
లోక, ముష్టిలో బట్టు నొదయ దెవడు,
హిమ, తపో వర్షకాలముల మూలలనుంచి
యెత్తి యుద్యోగంబు లిచ్చునెవడు;

తే॥గీ॥ తనకు దానె సమాన సౌందర్య సర్వ,
శక్తి విజ్ఞాన, సత్కృపా, శాంతమూర్తి
యెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన
ఘనుడగు యెహూవ దిక్కు నా కనుదినంబు.

4. పరమదూతల మోక్షపురమను దెవ్వనికంట
పరిశుద్ధముగ చూడ గౌరత దోఁచు,
సత్య ప్రియాధిక సంతోషముల మీద
నెవని సింహాసనం బెలమినుండు,
సకల జీవుల భక్ష్య సామగ్రులెల్ల నె
వ్వని చేతి దానంబులనుదినంబు,
సకలార్థ శబ్ద వాచకములన్నియు గూడి
యెవని పేర్కొనియాడ నెరుగలేవు,

తే॥గీ॥ ఎవ్వరే కాలమున కంటి కింపుతోడ,
జూడగోరిన తనరూపు జూపకుండు,
నెవడో, యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహోవ దిక్కునా కనుదినంబు

5. అఖల లోకముల వృత్తాంత మాద్యంతంబు
ఎవ్వని పటమునం దిమిడి యుండు,
సకలాంతరాత్మల సాక్షియై యెనడు కా
రణ కార్యభావనల్ గణనసేయు,

జీవ నిర్జీవ సైన్యావళిలో చిన్న
పురువైన తృణమైన మరువ డెవడు,
తగ భవిష్యద్భూత తత్కాలముల నేలు
చొక రీతిగల నీతి నుండు నెవడు,

తే॥గీ॥ తండ్రి తనయుండు విమలాత్మ తానె యగుచు,
నాణెముగ దీన భక్త బృందముల బ్రోచు
నెవడొ యాతడె నా తండ్రి యిష్టుడైన,
ఘనుడగు యెహూవ దిక్కునా కనుదినంబు

క॥ ధనపతులకు జనపతులకు
దినపతికిని నిశాపతికిని దివికిన్ భువికిన్
కొనబడనివి వినబడనివి
కనబడనివి రత్నపంచకములివియెసుమీ.

గీ॥ వాడబారనిపువ్వుల వైభవంబ
వానినెత్తావి నిత్య జీవనసుఖంబు
పతకమతులితసౌఖ్య సంపదలరాశి
యీ సరముదాట్చువాడెపో యేసు క్రీస్తు.

గీ॥ చూడు కన్నులు గనరాని సుందరంబు
వినుము వీనులు వినరాని విపులశక్తి
నిలుపు తలపున తలపున నిలుపరాని
యలవిరాడ్రూపమదిసుమీ యమృతపదము.

క॥ భగవద్దాసులదాసుం
దగు పురుషోత్తమునియాత్మ హస్తంబుల సొం
పుగ గ్రుచ్చు పూలసరమిది
దగిలించుడు హృద్గళముల తత్వజ్ఞులిలన్.

(సత్యవేదసారసంగ్రహముతో కలిపి దైవకుమార వర్ణనము సి.ఎల్.ఎస్. వారు ప్రచురించారు. మొదటి సంపుటిలో ఆ విధముగానే ప్రచురించడమైనది. దేవుని విరాడ్రూపవర్ణనము అనే ఈ రచన, ఈ పుస్తకములో, ఆఖరి మూడుపద్యములు, పంచరత్నములు కలిపి ప్రచురించడమైనది.)